మాట తప్పని నాయకుడు సీఎం జగన్

- పరిపాలన రాజధాని ప్రకటనతో ప్రజల్లో ఆనందోత్సాహాలు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళ


మధురవాడలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం అనంతరం గుమ్మడి కాయతో దిష్టి తీస్తున్న మహిళలు

మధురవాడ: విశాఖకు పరిపాలన రాజధాని త్వరలో వచ్చేస్తుందని, తాను కూడా విశాఖకు వస్తున్నానని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించడంతో ప్రజల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలువెత్తు ఫ్లెక్సీకి అభిమానులు, కాలనీవాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం దుష్టుల వల్ల కీడు జరగకూడదని గుమ్మడి కాయతో మహిళలు, నాయకులు చేకూరి రజిని, రాజు, శ్రీదేవి, తమ్మిన వరలక్ష్మి, అఖిల, మంగమ్మ తదితరులు దిష్టి తీశారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు పీకేఎమ్ పాత్రుడు, పిళ్లా సూరిబాబు, జగ్గుపిల్ల నరేష్, బంగారు ప్రకాశ్, వేగి రామిరెడ్డి, ఎల్లాజీ, పోలరాజు, వెంకటేశ్ పాల్గొన్నారు.

పద్మనాభం: విశాఖపట్నంలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తామని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించడంపై మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. జై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పడు, బోని సన్యాసినాయుడు, అముజూరి అప్పారావు, మొకర అప్పలనాయుడు, సీర సూర్పప్పడు, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, బి.వి.ఎస్.ఎన్.రాజు, జి.వి.కె.కె.వర్మ, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, దున్న అబ్రహం, గాడు అప్పలరాజు, బొలె అప్పలనాయుడు, తాలాడ పాప పాల్గొన్నారు.

విశాఖ నుంచి పరిపాలన ఎంతో మేలు

తగరపువలస: విశాఖను పరిపాలనా రాజధానిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం పట్ల ఇడదాసరిపేటలో ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. విశాఖ రాజధానిలో భీమిలి కీలకం కానున్నదని జేజేలు పలికారు.

గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

భీమునిపట్నం: స్థానిక నెహ్రూ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు రూ.5 వేల విలువైన పుస్తకాలు బుధవారం బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటాయన్న ఉద్దేశంతో పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల కోసం పుస్తకాలు అందివ్వడం ఎంతో గొప్ప విషయమని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 3వ వార్డు కార్పొరేటర్ గంటా అప్పలకొండ, హిందీ ప్రేమీ మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు పాల్గొన్నారు.

వైన్ షాప్ వద్దంటూ ఆందోళన


షాపు ప్రారంభాన్ని అడ్డుకుంటున్న స్థానిక మహిళలు

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ రాజీవ్‌నగర్‌లో నివాసాల మధ్య బుధవారం ప్రారంభించేందుకు సిద్ధమైన వైన్ షాపును స్థానిక మహిళలు అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఊరు మధ్యలో అనుమతులు లేకుండా షాపు నిర్మించడమే కాకుండా... ఇప్పుడు హఠాత్తుగా వైన్ షాపు ప్రారంభించడం ఎంత వరకు సమంజసమని మహిళలు ప్రశ్నించారు. గతంలో ఇక్కడ ఈ షాపు వద్దని ఆందోళన చేస్తే అధికారులు ఈ ప్రయత్నం విరమించుకున్నట్లు స్థానిక మహిళలు తెలిపారు.

రోడ్లు, డ్రైనేజీల బాధ్యత బిల్డర్లదే


సంగివలస అక్షర మెడోస్ అపార్ట్‌మెంట్ వద్ద లబ్ధిదారునితో ఎమ్మెల్యే శ్రీనివాసరావు

తగరపువలస: అపార్ట్‌మెంట్ల నిర్మాణం తర్వాత వాటికి అనుసంధానంగా రోడ్లు, డ్రైనేజీలను నిర్మించాల్సిన బాధ్యత బిల్డర్లదేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గతంలో నిర్మించిన అపార్ట్‌మెంట్లకు ఈ వసతులు లేకపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఇకపై అపార్ట్‌మెంట్లకు ఈ వసతులు ఖచ్చితంగా ఉండేటట్టు చూడాలని జీవీఎంసీ అధికారులకు ఆయన సూచించారు. బుధవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా భీమిలి జోన్ రెండో వార్డు ఇడదాసరిపేట, ఉప్పిలిపేట, సంగివలస అక్షర మెడోస్ అపార్ట్‌మెంట్ల వద్ద ఆయన స్థానికులతో మాట్లాడారు. మోసపూరిత మాటలతో బిల్డర్లు కొనుగోలుదారులకు ఫ్లాట్లు విక్రయిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్ పార్టీలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వసతులు కల్పించకుండా ఫ్లాట్లు విక్రయించిన బిల్డర్లపై క్రిమినల్ కేసులు పెట్టనున్నట్టు జెడ్సీ బి.రాము హెచ్చరించారు. తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి, కో ఆప్షన్ సభ్యురాలు కొప్పల ప్రభావతి, వార్డు అధ్యక్షుడు చిల్లా భాస్కరరెడ్డి, నాయకులు చిప్పాడ వెంకటేష్, చిల్ల సూర్యనారాయణరెడ్డి, కొప్పల రమేష్, జీరు సుజాత, చిల్ల ప్రమీల, అక్కరమాని లోవరాజు, నీలాపు శివశంకరరెడ్డి, భాగం స్వాతి సుధాకర్, గుండాసి మధు, కదిరి ఎల్లాజీ పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ

తగరపువలస: తాళ్లవలస పంచాయితీ ఎరుసుపేటలో రూ.8 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. బోని సన్నిబాబు, ఉప సర్పంచ్ బీఎస్ఎన్ రాజు, పార్టీ గ్రామ అధ్యక్షుడు అక్కరమాని అప్పలనాయుడు, మండల వర్కింగ్ యూత్ ప్రెసిడెంట్ చిల్ల హరి, చిన్ని రాజు, కాకర ఎల్లారావు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ బాధ్యత అందరిదీ

మధురవాడ: పారిశుధ్యం సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత జీవీఎంసీ సిబ్బందిపై ఉంటే, దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంటుందని జోన్ - 2 కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి అన్నారు. బుధవారం ఉదయం బొట్టవానిపాలెం వార్డు కార్యాలయం వద్ద శానిటేషన్ సిబ్బంది అటెండెన్స్‌ను ఆమె పరిశీలించారు. తర్వాత వాంబేకాలనీ బ్లాకుల వెనుక కొందరు చెత్త వేసేస్తున్నారని ఫిర్యాదు రావడంతో కాలనీలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. నగరం మరింత పరిశుభ్రంగా, అందంగా ఉండాలంటే తడి, పొడి చెత్త వేరు చేసి అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఆనందపురం : మండలంలోని గంభీరం పంచాయతీ ఎస్టీ కాలనీ వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని పోలీసులు తెలిపారు. సుమారు 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసుని ఎస్ఐ శ్యామ్ సుందర్ దర్యాప్తు చేస్తున్నారు.

అప్పలరాజు మృతికి సంతాపం

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడివాడ అప్పలరాజు బుధవారం మృతి చెందారు. అస్వస్థత కారణంగా ఆయన కొంత కాలంగా ఇంటివద్దే ఉంటున్నాడు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భీమిలి ఎస్సీ సెల్ అధ్యక్షునిగా పనిచేశారు. ఆయనకు తల్లి, భార్య ఉన్నారు. కొండపేటలో ఆయన భౌతికకాయానికి పార్టీ భీమిలి ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్, మాజీ కౌన్సిలర్ ఉప్పాడ నాగేశ్వరరావు, నాయకులు జీరు వెంకటరెడ్డి, చిల్ల గణేష్‌రెడ్డి, శిల్లా వంశీరెడ్డి, పందిరి విజయ్, అక్కరమాని చినబాబు నివాళులర్పించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ముత్తంశెట్టి మహేష్ తదితరులు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ చదునుపట్టు వద్ద చేపట్టనున్న అభివృద్ధి పనులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఇక్కడి మెయిన్‌రోడ్డులోని బస్టాండ్ సమీపంలో ఉత్సవాలకు ముందు చాటింపు వేడుక సమయంలో అమ్మవారి గరగను ఊరేగించిన తర్వాత చదునుపట్టు వద్ద ఉంచుతారు. భక్తులు రోజూ దర్శించుకుంటారు. అయితే ఈ చదునుపట్టు శిథిలమవడంతో అభివృద్ధి చేయడానికి కమిటీ నిర్ణయించి పనులను ప్రారంభించింది. నూకాలమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, ఆలయ పూజారి చౌదరి సత్యరాజు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలని ర్యాలీ

ఆనందపురం : పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని వివిధ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఆనందపురం జంక్షన్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ.26వేలు వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రెండు జతలు యూనిఫారమ్ ఇవ్వాలని, గ్లౌజులు, మాస్కులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఎంపీడీవో లవరాజుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో రవ్వ నరిసింగరావు, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

24 మంది సచివాలయ కార్యదర్శులకు మెమోలు

మధురవాడ : జీవీఎంసీ జోన్ - 2లో గల వివిధ వార్డు సచివాలయాల్లో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న 24 మంది అడ్మిన్ సెక్రటరీలకు మెమోలు ఇచ్చినట్టు జోనల్ కమిషనర్ కొట్యాడ కనక మహాలక్ష్మి చెప్పారు. ఎన్నిసార్లు చెప్పినా వీరి పని తీరులో మార్పు రాకపోవడంతో మెమోలు జారీ చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న సిటిజన్స్ అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు చర్యలు చేపట్టారు. 10 సచివాలయాల్లో సున్నా రిజల్ట్ ఉండడంతో ఆగ్రహం వ్యక్త చేశారు. మార్పు రాకపోతే మరింత కఠిన చర్యలు చేపడతామని కనక మహాలక్ష్మి చెప్పారు.

ఏఈగా అప్పలనాయుడు

పీఎం పాలెం: పీఎం పాలెం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నూతన ఏఈగా మండల అప్పలనాయుడు బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ ఏఈగా పనిచేసిన డి.నరేష్ నగరంలోని ఎల్‌టీ మీటర్స్ విభాగానికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అప్పలనాయుడు శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నుంచి ఇక్కడకు వచ్చారు.

అధికారులు బాధ్యతగా పనిచేయాలి

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: అధికారులంతా బాధ్యతాయుతంగా పని చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ కంటుబోతు రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న సచివాలయాలు, రోడ్ల నిర్మాణాలను మార్చి ఒకటిలోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన జగనన్న కాలనీ ఇళ్లను పేదలందరూ నిర్మించుకోవాలని తెలిపారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి కొరత లేకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, భీమునిపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ యలమంచలి సూర్యనారాయణ, ఎంపీడీవో పి.రాధ, మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.


మోపెడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మత్స్యకారులకు మోపెడ్ల పంపిణీ

ఐస్ బాక్సులతో కూడిన మోపెడ్లు మత్స్యకారులకు వృత్తిపరంగా బాసటగా నిలుస్తాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గంలోని ఆనందపురం, పద్మనాభం, భీమునిపట్నం మండలాలకు చెందిన 18 మంది మత్స్యకారులకు పీఎంఎస్ఎస్‌వై పథకం కింద బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఐస్ బాక్సులతో కూడిన మోపెడ్లు ఆయన పంపిణీ చేశారు. మత్స్యశాఖ జేడీ జి.విజయ, ఎఫ్‌డీవో లావణ్య, డీపీఎం కృష్ణ పాల్గొన్నారు.

4న జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశం

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం 4న శనివారం నిర్వహించనున్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు చెందిన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షన నిర్వహించనున్నట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. 4న ఉదయం పది గంటల నుంచి సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎస్‌పీఎల్‌లో అర్ధ సెంచరీల మోత

దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరుకుంది. బుధవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌ల్లో అర్ధ సెంచరీల మోతతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఉదయం మూడో స్థానం కోసం మ్యాచ్‌లు జరగగా... మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరిగాయి. వీటిలో బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలతో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించి తమ జట్లను ఫైనల్స్‌కు చేర్చారు. గురువారం ఉదయం జూనియర్స్ విభాగంలో జరిగే ఫైనల్ పోరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ (కంచరపాలెం), సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) తలపడనున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్ల మధ్య ఫైనల్స్ పోరు జరగనుంది. విజేతలకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.


శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు


దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు


ఫైనల్స్‌కు చేరుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు

14 పరుగుల తేడాతో ఎస్ఎస్ఆర్ఐటీ విజయం

బుధవారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు (శొంఠ్యాం) 14 పరుగుల తేడాతో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన జీవీపీ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీపీ కాలేజ్ 9.3 ఓవర్లలో 70 పరుగులు చేసి ఆలౌట్ అయింది.

8 పరుగుల తేడాతో శ్రీ కాశ్యప్ విజయకేతనం

రెండో మ్యాచ్‌లో అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ (నర్సీపట్నం), శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ (శ్రీనగర్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టపోయి కేవలం 65 పరుగులు మాత్రమే చేసింది. శ్రీ కాశ్యప్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.

9 వికెట్ల తేడాతో డైట్ కాలేజ్ భారీ విజయం

మధ్యాహ్నం జరిగిన తొలి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో రఘు ఇంజినీరింగ్ కాలేజ్(దాకమర్రి), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు (అనకాపల్లి) తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రఘు ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 9 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 80 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించి ఫైనల్స్‌కు చేరుకుంది.

భారీ విజయంతో ఫైనల్‌కు ఎస్ఎస్ఆర్ఐటీ

మధ్యాహ్నం జరిగిన నాలుగో మ్యాచ్ సెమీ ఫైనల్స్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ 46 పరుగుల భారీ ఆధిక్యంతో శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు నిర్ణత 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 95 పరుగుల స్కోరు నమోదు చేసింది. భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగింది.

షాలిమార్ - తాంబరం స్పెషల్ రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): షాలిమార్-తాంబరం-షాలిమార్(08041/08042) వీక్లీ స్పెషల్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేరు డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రాంచీ - విల్లుపురం - రాంచీ మధ్య స్పెషల్స్

దక్షిణ భారతదేశంలోని వలస కార్మికుల సౌకర్యార్థం రాంచీ - విల్లుపురం - రాంచీ (08068 / 08067) మధ్య వీక్లీ స్పెషల్స్ నడుపుతున్నట్లు త్రిపాఠి తెలిపారు. ప్రతీ శుక్రవారం రాంచీలో మధ్యరాత్రి 11.55 గంటలకు బయల్దేరి దువ్వాడ మీదుగా ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విల్లుపురంలో ప్రతీ మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు బయల్దేరి గురువారం ఉదయం 6.45కు రాంచీ చేరుకుంటుంది. ఈ వీక్లీ స్పెషల్ రైలు ఫిబ్రవరి 3వ తేదీ నుంచి 28 వరకు నడుస్తుంది.

➡ మచిలీపట్నం - విశాఖపట్నం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌కు మరో మూడు స్లీపర్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు.

యూరోపియన్ సదస్సుకు అపోలో వైద్యుడు

ఆరిలోవ(విశాఖ తూర్పు): ఈ ఏడాది మే నెలలో జరగనున్న యూరోపియన్ వార్షిక సదస్సుకు హాజరు కావాలని హెల్త్‌సిటీ అపోలో ఆస్పత్రికి చెందిన ఆర్థోపెడిక్ వైద్య నిపుణుడు డాక్టర్ అబ్దుల్ డి.ఖాన్‌కు ఆహ్వానం అందింది. యూరోపియన్ ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ ఇన్ ఆర్థోపెడిక్స్ అండ్ ట్రమటాలజీ(ఎఫెర్ట్) ఆధ్వర్యంలో యూరప్ ఖండం వియన్నాలో ఈ సదస్సు జరగనుంది. అపోలోలో తాను విజయవంతంగా నిర్వహించిన రెండు సర్జరీలకు సంబంధించిన కథనాలపై ఈ సదస్సులో మౌఖిక ప్రదర్శన చేస్తానని ఖాన్ బుధవారం తెలిపారు.

కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్చాలని వినతి

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరు నాగేశ్వరరావును పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యల మీద మంత్రికి వినతి పత్రం సమర్పించారు. తాత్కాలిక పద్ధతిలో పనిచేస్తున్న సుమారు 750 మంది అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్లను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేయాలని కోరారు.

ఇంటర్ పరీక్షలపై ప్రత్యేక శ్రద్ధ

ఆర్ఐవో సత్యనారాయణ

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ తెలిపారు. పరీక్షల నిర్వహణకు సన్నద్ధత చేసే క్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు బుధవారం వెబెక్స్ ద్వారా సమీక్షించారు. నగరంలోని ఆర్ఐవో కార్యాలయం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. ప్రాక్టికల్స్, వార్షిక పరీక్షల నిర్వహణకు ఉమ్మడి విశాఖ జిల్లాలో చేస్తున్న ఏర్పాట్లపై ఉన్నతాధికారులకు ఆర్ఐవో వివరించారు. విశాఖలో 185, అనకాపల్లిలో 136, అల్లూరి జిల్లాలో 39 జూనియర్ కాలేజీల నుంచి మొదటి సంవత్సరం 56,437 మంది, రెండో సంవత్సరం 56,625 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రైవేట్‌గా 8,116 మంది పరీక్షలకు ఫీజు చెల్లించినట్లు వివరించారు. ప్రాక్టికల్ పరీక్షల నిర్వహణ కోసం తగిన సౌకర్యాలు ఉన్న కాలేజీలను ఇప్పటికే గుర్తించినట్లు చెప్పారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసేలా ఇప్పటికే కళాశాల ప్రిన్సిపాళ్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. అనకాపల్లి జిల్లా డీవీఈవో బి.సుజాత, కార్యాలయ పర్యవేక్షకుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచనలే జీవితాన్ని నిర్దేశిస్తాయి


మాట్లాడుతున్న సీపీ సీహెచ్ శ్రీకాంత్

కొమ్మాది: మన ఆలోచనలే మన జీవితాన్ని నిర్దేశిస్తాయని, అందుకే యువత ఆలోచనలు ఎప్పుడూ ఉన్నతంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సూచించారు. రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన ట్రైనింగ్ మిషన్ సంస్థ భవన్‌లో భారత ప్రభుత్వం, యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 14వ గిరిజన యూత్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జీవితంలో ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని, నిరంతరం సాధన చేసిన నాడే ఉన్నత స్థానానికి చేరుకోగలరన్నారు. యువత నక్సలిజం వైపు, చెడు మార్గాల వైపు వెళ్లడానికి గల కారణాలను విశ్లేషిస్తూ వాటిని అధిగమించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించారు. నెహ్రూ యువ కేంద్రం సంచాలకులు ఎ.విజయారావు, ట్రైనింగ్ సెంటర్ ఈడీ చినబాబు పాల్గొన్నారు.

సంజీవని నిధికి 'ఇంటర్' విరాళం రూ.50 వేలు


కలెక్టర్ మల్లికార్జునకు చెక్ అందజేస్తున్న ఆర్ఐవో

విశాఖ విద్య: జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన సంజీవని నిధికి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల తరపున రూ.50 వేలను వితరణ ఇచ్చారు. దీనిని చెక్కు రూపంలో ఆర్ఐవో ఆర్.సత్యనారాయణ బుధవారం కలెక్టర్ డాక్టర్ మల్లికార్జునకు అందజేశారు. జిల్లాలోని 10 కాలేజీల నుంచి రూ.50 వేలు సేకరించగా, ఇందులో ఒక్క పెందుర్తి కాలేజీ నుంచే రూ. 20 వేలు ఇచ్చారు. నిరుపేదలకు ఆరోగ్య పరంగా అత్యవసర సమయంలో ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన సంజీవని నిధికి తోచిన రీతిలో వితరణ ఇచ్చేందుకు ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ముందుకు వస్తుండటం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లను ఈ విషయంలో చైతన్యం తీసుకొచ్చిన ఆర్ఐవోను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా జీఎం రెడ్డి

విశాఖ లీగల్: విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది జి.మహేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వైద్యుల రవీంద్ర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. 2023-24 సంవత్సరానికి సంఘం వార్షిక ఎన్నికలు ఈ నెల 24న నిర్వహించేందుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ ఇప్పటికే షెడ్యూల్ విడుదల చేసింది.

ఈ ఎన్నికల్లో అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి, క్రీడా, గ్రంథాలయ కార్యదర్శులు, సీనియర్ సభ్యులతో పాటు మహిళా ప్రతినిధిని, మరో 10 మంది సాధారణ సభ్యులను ఎన్నుకుంటారు. వివిధ పదవులకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఇప్పటికే ప్రచారం ముమ్మరం చేశారు.

విశాఖ టు ఢిల్లీ ప్రజాపోరు యాత్ర


యాత్రను ప్రారంభిస్తున్న మిట్ట రామారావు

సీతంపేట(విశాఖ ఉత్తర): కరెన్సీ నోట్లపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని, దీనిపై ఈ పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టాలని కరెన్సీపై అంబేద్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జెర్రిపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం స్థానిక అంబేడ్కర్ భవన్ నుంచి ఢిల్లీ వరకు ప్రజాపోరు రథయాత్ర చేపట్టారు. విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మిట్ట రామారావు, దళిత ద్రావిడ పార్టీ జాతీయ అధ్యక్షుడు మళ్ల జీవన్‌కుమార్, సీఏపీఎస్ జాతీయ సలహాదారు ఆళ్ళ రామకృష్ణ జెండా ఊపి యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పరశురామ్ మాట్లాడుతూ ఈ డిమాండ్ సాధన కోసం గత ఐదేళ్లలో పాదయాత్ర, ప్రజాచైతన్య రథయాత్ర, జ్ఞానయుధ యాత్ర, ఢిల్లీలో మహాధర్నా నిర్వహించామని, 8 మంది ఎంపీలతో మాట్లాడినట్టు తెలిపారు. మిగతా ఎంపీలతో కూడా మాట్లాడి పార్లమెంట్‌లో బిల్లుపెట్టాలన్న లక్ష్యంతో ఇప్పుడు ప్రజాపోరు యాత్ర తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కంఠ వేణు, ఆతవ విజయభాస్కర్, చింతాడ రత్నం, గురుమూర్తి ప్రభాకర్, పిడుగు ఆశీర్వాదం పాల్గొన్నారు.